నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
13 | హైదరాబాద్, గురువారం 8 ఫిబ్రవరి 2024 | SIDDIPET

సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించం

- రాజకీయాల్లో రౌడీయిజం పనికి రాదు
- మైనంపల్లి నువ్వు బ్రాండ్ కాదు.. పెద్ద గుండా
- నాడు కేటీఆర్ కాళ్లు మొక్కి, నేడు విమర్శలా..
- ఫుట్‌బాల్ కోచ్ అక్బర్ నవాబ్‌పై దాడిని ఖండిస్తున్నాం
- సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, ఫిబ్రవరి 7: 'బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని, మైనంపల్లి హన్మంతరావు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల సాయిరామ్, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, మెరుగు మహేశ్, నిమ్మ రజినీకాంత్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మైనంపల్లి అంటేనే ఒక బ్రాండ్ అని గొప్పలు చెప్పుకుంటున్న హన్మంతరావు వాస్తవానికి ఒక పెద్ద గుండా అని, ఏ హోదాలో సిద్దిపేటలో పర్యటించారని ప్రశ్నించారు. మల్కాజిగిరిలో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టారని గుర్తుచేశారు. రాజకీయాల్లో రౌడీయిజం పనికి రాదని, మంగళవారం సిద్దిపేటకు ఎందుకు వచ్చారు, ఎందుకు వెళ్లారో కాంగ్రెస్ నాయకులకే తెలియని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. క్రమశిక్షణకు మారుపేరు బీఆర్ఎస్ అని, మీలాగా గుండాయిజం చేసే నాయకులు మా పార్టీలో లేరన్నారు. ప్రభుత్వం తరపున వస్తే సిద్దిపేటలో అభివృద్ధికి నిధులు కేటాయిస్తారేమో అనుకున్నామని, అవేమీ చెప్పకుండానే వ్యక్తిగత విమర్శలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం సిగ్గు చేటన్నారు. నిత్యం 18 గంటలు ప్రజాక్షేత్రంలో తిరిగే గొప్ప నాయకుడు హరీశ్‌రావుపై వ్యక్తిగతంగా విమర్శలు చేస్తే సహించే లేదని, మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు చేసే ముందు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేశామా అని ప్రశ్నించారు. హైదరాబాద్ గుండా మైనంపల్లి సిద్దిపేటకు వచ్చి ఇక్కడ అభద్రతా భావాన్ని సృష్టించేలా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అనాలోచిత, అవాస్తవ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కేటీఆర్‌కు ఏమి తెలియదన్నప్పుడు గతంలో అతడి కాళ్లు ఎందుకు మొక్కావంటూ ప్రశ్నించారు. హన్మంతరావు బెదిరింపులకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భయపడేదిలేదన్నారు. బీఆర్ఎస్ నాయకుడు, ఫుట్‌బాల్ కోచ్ అక్బర్ నవాబ్‌పై దాడి పిరికిపంద చర్య అన్నారు. సిద్దిపేట అభివృద్ధిని చూసేందుకు రెండు రోజులు సరిపోవని, వారం రోజులు ఇక్కడ ఉంటే తెలుస్తుందన్నారు. సమావేశంలో కౌన్సిలర్ వజీర్, బీఆర్ఎస్ నాయకులు మోయిజ్, అక్బర్ నవాబ్, రెబల్ రమేశ్, పెర్క మధు, శ్యామ్ యాదవ్, రాజు, స్వామి, సాయిచరణ్‌గౌడ్, షాదుల్ పాల్గొన్నారు.

## నాడు జలకళ.. నేడు వెలవెల

నెర్రెలిడిన సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట -లక్ష్మీదేవిపల్లి అమ్మకుంట చెరువు

బీఆర్ఎస్ సర్కారు మారగానే సిద్దిపేట జిల్లాలో రైతులకు సాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. ఎండల తీవ్రతకు భూగర్భ జలాలు అడుగంటుతుండగా.. చెరువులు, కుంటలు, వాగులు ఎండిపోతున్నాయి. అనధికార కరెంట్ కోతలు, బోరుబావుల్లో నీటిమట్టం పడిపోతుండడంతో యాసంగి పంటలు కాపాడుకోవడానికి రైతులు ఆందోళన చెందవుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్న గత ఐదారేండ్లుగా ఎండాకాలం రాకముందే కాళేశ్వర జలాలతో సిద్దిపేట జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు నింపడంతో రైతులకు సాగు నీటి కష్టాలు తలెత్తలేదు. ఫలితంగా గుంట ఎండిపోకుండా పంటలు పండాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సిద్దిపేట జిల్లాను సస్యశ్యామలం చేశారు. రైతులకు పుష్కలంగా సాగునీరు అందించడంతో భూమికి బరువయ్యేలా పంటలు పండించారు. ఉచిత కరెంట్, రైతుబంధు వంటి ప్రభుత్వ చేయూతతో కర్షకులు హాయిగా ఎవుసం చేసుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. రైతుబంధు పూర్తి స్థాయిలో రైతులకు అందలేదు. కరెంట్ కోతలు షురూ అయ్యాయి. ఈసారి యాసంగి కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి జిల్లాలో అన్ని ప్రాంతాలకు నీరందించలేదు. దీంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు దిగులు పడుతున్నారు.

- సిద్దిపేట, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

### అడుగంటుతున్న భూగర్భ జలాలు

ఎండుతున్న చెరువులు, కుంటలు, వాగులు
యాసంగి పంటలు దక్కేదెలా అని రైతుల్లో ఆందోళన
బావుల తవ్వకానికి క్రేన్లు తెస్తున్న అన్నదాతలు
ఆరేండ్ల తర్వాత మళ్లీ కనిపిస్తున్న క్రేన్లు
అన్ని ప్రాంతాలకు విడుదల చేయని కాళేశ్వరం జలాలు

### పూడికతీత పనులు షురూ..

ఐదారేండ్ల తర్వాత సిద్దిపేట జిల్లాలో రైతులు మళ్లీ బావుల పూడికతీత పనులు షురూ చేశారు. జిల్లాలో చాలాచోట్ల బావులలోతు చేసేందుకు క్రేన్లను ఫిట్ చేస్తున్నారు. గత యాసంగి సాగుచేసిన దానికంటే తక్కువగానే పంటలు సాగుచేశారు.ఉన్న పంటలను కాపాడుకుందామంటే అప్పుడే సాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయని, బావుల పూడికతీత పనులకు శ్రీకారం చుట్టినట్లు రైతులు చెప్పారు.

## దుర్వాసన నుంచి భక్తులకు విముక్తి

- కేతకీ ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూస్తాం
- మండల ప్రత్యేకాధికారి భిక్షపతి

ఝరాసంగం, ఫిబ్రవరి 7: దుర్వాసన నుంచి భక్తులకు విముక్తి కలిగింది. కేతకీ ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూస్తామని మండల ప్రత్యేకాధికారి భిక్షపతి తెలిపారు. కేతకీ ఆలయానికి వచ్చే భక్తులు దుర్వాసనతో అవస్థలు పడుతున్న విషయాన్ని 'నమస్తే తెలంగాణ'లో కంపుకొడుతున్న కేతకీ పరిసరాలు అనే వార్త ప్రచురితమైంది. బుధవారం మండల ప్రత్యేకాధికారి వార్తకు స్పందించి కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో ప్రవహిస్తున్న వాలాద్రి వాగులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పరిశీలించారు. కేతకీ ఆలయ కార్యనిర్వహణ అధికారి శశిధర్ అందుబాటులో లేకపోవడంతో చరవాణిలో సంప్రదించి వాగులో ఉన్న చెత్తాచెదారం తొలిగింపు విషయంపై అడగ్గా, మా పరిధిలోకి రాదని సమాధానమిస్తూ దాటవేశారని భిక్షపతి తెలిపారు. దీంతో ప్రత్యేకాధికారి చొరవ తీసుకొని జేసీబీ సాయంతో చెత్తను తొలిగించారు. దీంతో భక్తులు, వ్యాపారులు, కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం చుట్టుపక్కల ఉన్న కాలనీల్లో పర్యటించి తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యలు అడిగి తెసుసుకున్నారు.

జేసీబీ సాయంతో వాలాద్రి వాగులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలిగిస్తున్న సిబ్బంది

### పాలాలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది..

మాకు మూడెకరాల వ్యవసాయ పొలం ఉంది. చెరువుల్లో నీళ్లు లేక పొలాలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. బీఆర్ఎస్ సర్కారు ఉన్నప్పుడు కాల్వల ద్వారా మా ఊరి చెరువులోకి నీళ్లు వచ్చేవి. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. పంట పొలాలు ఎండిపోతుంటే బాధగా ఉంది. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఎదురైంది. దయచేసి మా చెరువుల్లోకి నీళ్లు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– చల్లా మాధవి, మహిళా రైతు, కోదండరావుపల్లి, నారాయణరావుపేట మండలం సిద్దిపేట జిల్లా

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లాలో రంగనాయక, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లు నిర్మించారు. వీటికి తోడు అన్నపూర్ణ, తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్, తపాస్‌పల్లి రిజర్వాయర్, శనిగరం మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేశారు. ఏటా యాసంగి సాగుకు పుష్కలంగా గోదావరి జలాలను గత కేసీఆర్ ప్రభుత్వం అందించి రైతుల పంటలు ఎండిపోకుండా కాపాడింది. ఈ ఏడాది యాసంగికి సాగునీటిని విడుదల చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు స్వయంగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆ తర్వాత మంత్రికి ఫోన్‌చేసి రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్ల నుంచి చెరువులకు నీటిని విడుదల చేయాలని విన్నవించడంతో పాటు స్వయంగా ఉత్తరం రాశారు. ఫలితంగా హరీశ్‌రావు చొరవతో సాగు నీటిని ఎట్టకేలకు గత నెల 24న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ నీటిని విడుదల చేశారు. జిల్లా ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి ఒత్తిడితో ఎట్టకేలకు మల్లన్నసాగర్ నుంచి దుబ్బాక ప్రాంతానికి నీటిని విడుదల చేశారు. ఇటీవల కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేసిన అధికారులు కొండపోచమ్మ నుంచి హుల్దీవాగుకు ఇంకా నీటిని విడుదల చేయలేదు. రంగనాయకసాగర్ నుంచి అన్ని ప్రాంతాలకు నీరు వెళ్లకపోవడంతో చెరువులు నెర్రెలు బారుతున్నాయి. నారాయణరావుపేట మండలంలోని కోదండరావుపల్లి, లక్ష్మీదేవిపల్లి చెరువులు ఎండిపోయాయి. వీటితోపాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోని చెరువుల్లో నీరు పూర్తిగా అడుగంటుతున్నాయి. బావుల్లో నీటిమట్టం తగ్గిపోతున్నది. హుల్దీవాగులోకి నీటిని విడుదల చేస్తే సిద్దిపేట, మెదక్ జిల్లాలతో పాటు కామారెడ్డి జిల్లా రైతులకు ఎంతో ప్రయోజనం ఉండేది. ఇటు చేర్యాల ప్రాంతానికి తపాస్‌పల్లి నీటిని విడుదల చేయలేదు. లద్నూర రిజర్వాయర్ పరిస్థితి అంతే..తోటపల్లి రిజర్వాయర్, శనిగరం ప్రాజెక్టుల కింద పరిస్థితులు అంతే అని చెప్పాలి. హుస్నాబాద్ ప్రాంతానికి గౌరవెల్లి రిజర్వాయర్ నుంచి నీటిని అందించాలి. అన్నీ సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వాయర్ గురించి ముందుకు వెళ్లడం లేదు. దీంతో రైతులకు సాగు నీటి కష్టాలు తప్పడం లేదు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎక్కడ చూసినా కాళేశ్వరం జలాలు పరుగులు పెట్టాయి. నేడు ఎటు చూసినా ఎండిపోయిన చెరువులు కనిపిస్తున్నాయి.

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల-జేపీతండాల శివారులో బావుల పూడికతీత పనులు

సిద్దిపేట జిల్లా నారాయణరావు పేట మండలం కోదండరావుపల్లిలో నీళ్లు లేక ఎండిపోయిన పల్లెచెరువు

## ప్రవేశాల గడువు పొడిగింపు

ఉమ్మడి మెదక్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింహ

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 7: తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాసంస్థల్లో ప్రవేశాలకు ఈ నెల15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఉమ్మడి మెదక్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి రుసుం లేకుండా విద్యార్థులు ఆధార్‌కార్డు, ఫొటో, సంతకంతో ఆన్‌లోన్‌లో www.tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్ లేదా టీఎంఆర్ఈఐఎస్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలుంటే 040-23437909ను సంప్రదించాలని సూచించారు. మైనార్టీ విద్యార్థులకు ముందుగా, ఇతరులకు డ్రా పద్ధతిలో సీట్లు కేటాయిస్తామని తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణత ఆధారంగా ఇంటర్‌లో సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో విద్యార్థులకు ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా సీట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

## జాతరకు పోదాం..

కొలువైన కూడవెల్లి రామలింగేశ్వర స్వామి

- ముస్తాబైన 'కూడవెల్లి రామలింగేశ్వరాలయం'
- నేటి నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు
- రేపటి నుంచి ఐదు రోజుల పాటు జాతర
- సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలో ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు

దుబ్బాక, ఫిబ్రవరి 7: మాఘ అమావాస్య అంటేనే..' కూడవెల్లి జాతర'...! కూడవెల్లిలో మాఘ స్నానాలు ఆచరించి రామలింగేశ్వరుడిని దర్శించుకుంటే.. సకల సిరిసంపదలతో పాటు కైలాస ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. దక్షణ కాశీగా పేరొందిన కూడవెల్లి రామలింగేశ్వరక్షేత్రం సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని రామేశ్వరంపల్లిలో ఉంది. ఈ జాతరకు సిద్దిపేట జిల్లా వాసులే కాకుండా పక్క జిల్లాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తారు. రామలింగేశ్వరుడిని దర్శించుకుని, ఆలయం వద్ద జాతరను తిలకించేందుకు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆసక్తి కనబరుస్తారు. మాఘ అమావాస్య రోజు 'త్రివేణి సంగమం'గా పేరొందిన కూడవెల్లివాగులో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి ఒడ్డుపై వెలిసిన రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఏటా లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఈ నెల 9 నుంచి 13 వరకు (ఐదు రోజులు) ఆలయం వద్ద పెద్ద ఎత్తున జాతర కొనసాగనుంది. ఆలయం వద్ద భక్తుల సౌకర్యం కోసం దేవాలయ పాలకవర్గం, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కూడవెల్లి వాగు (మండవ్య నది) పక్కన వెలిసిన రామలింగేశ్వరాలయంతో పాటు ఇతర దేవాలయాలు

## పచ్చని గ్రామాలు ఆరోగ్యానికి నిలయాలు

○ ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి ○ సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

నందికందిలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సదాశివపేట, ఫిబ్రవరి 7: గ్రామాలు పచ్చగా, పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలపరిధిలోని నందికంది గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యానికి సంబంధించిన సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. గ్రామంలో నాటిన మొక్కలను రక్షించుకోవాలని, మహిళలు తడి,పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించే విధంగా కృషి చేయాలన్నారు. గ్రంథాలయ ఏర్పాటుకు అవసరమైన భవనం, స్థలం గుర్తించాలని, గ్రంథాలయం యువత, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో సామ్, నామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పౌష్టికాహారం అందించి, పోషణ లోపం లేని పిల్లలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎల్‌పీవో సతీశ్‌రెడ్డి, ఎంపీడీవో పూజ, ఎంఈవో, తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డెహ్రాడూన్ నుంచి వచ్చి నివాళులర్పించిన తల్లి

తూప్రాన్, ఫిబ్రవరి 7: గతేడాది శిక్షణ విమానం కూలిపోయి చనిపోయిన కుమారుడి సమాధి వద్దకు వందల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి ఓ తల్లి నివాళులర్పించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి చెందిన శిక్షణ విమానం (పీసీ 7 ఎంకే) సాంకేతిక లోపంతో తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని రావెల్లి శివారులో గుట్టల మధ్య గతేడాది డిసెంబర్ 4న కుప్పకూలి దగ్ధమైంది. ఈ దుర్ఘటనలో పైలెట్ అభిమన్యు రాయ్‌తోపాటు శిక్షణ పొందుతున్న వూవ్యాన్ తైన్ అనే వ్యక్తి సజీవ దహనమయ్యారు. మృతదేహాలు గుర్తు పట్టలేనంతగా కాలిపోయాయి. దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు అక్కడికి చేరుకుని కుటుంబసభ్యులకు సమాచారమిచ్చి, దర్యాప్తు చేపట్టారు. పైలెట్ అభిమన్యు రాయ్ తన తల్లిదండ్రులకు ఏకైక కుమారుడు. కుమారుడి మీద ఉన్న ప్రేమతో డెహ్రాడూన్ నుంచి తూప్రాన్ చేరుకున్న అభిమన్యురాయ్ తల్లి శిక్షణ విమానం కూలిన చోటే స్మృతివనాన్ని నిర్మించేందుకు సహకరించాలని అధికారులను కోరగా అంగీకరించారు. దీంతో అభిమన్యురాయ్‌కు గుర్తుగా అతడు మృతిచెందిన ప్రాంతంలోనే సమాధిని నిర్మించింది. ఫిబ్రవరి 7న అభిమన్యురాయ్ పుట్టినరోజు కావడంతో తల్లి చిత్రలేఖరాయ్ ఉత్తరాఖండ్ నుంచి తూప్రాన్ చేరుకుని నివాళులర్పించింది. అక్కడ స్మృతి వనాన్ని నిర్మిస్తానని, అప్పుడే తన కుమారుడి ఆత్మకు శాంతి లభిస్తుందని ఆమె పేర్కొంది.

అభిమన్యురాయ్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న తల్లి చిత్రలేఖరాయ్

## చెట్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ముగ్గురికి తీవ్ర, 27మందికి స్వల్ప గాయాలు

రాళ్లకత్వ గ్రామం వద్ద చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

జిన్నారం, ఫిబ్రవరి 7: అతివేగంతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటన జిన్నారం మండలంలోని రాళ్లకత్వ గ్రామంలో జరిగింది. స్థానికులు, ప్రయాణికుల కథనం ప్రకారం... మెదక్ జిల్లా నర్సాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం ఉదయం 9:30 ప్రాంతంలో సోలక్‌పల్లి మీదుగా పటాన్‌చెరు వెళ్తుండగా రాళ్లకత్వ గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొట్టింది. బస్సులో ఉన్న 30 మందిలో ముగ్గురికి తీవ్రంగా, 27మందికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణం బస్సు అతివేగమేనని గ్రామస్తులు, ప్రయాణికులు తెలిపారు. బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని పటాన్‌చెరులోని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. చెట్టు ఢీకొన్న సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్, వడ్డె కృష్ణ, సోలక్‌పల్లి మాజీసర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి దవాఖానకు వెళ్లి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

## రోడ్డు నిబంధనలు పాటించాలి

కంకోల్ టోల్‌ప్లాజా వద్ద వాహనదారుడికి పువ్వు అందజేస్తున్న సంగారెడ్డి ఎస్పీ రూపేశ్ కుమార్

మునిపల్లి, ఫిబ్రవరి 7 : రోడ్డు నిబంధనలు పాటించాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్ కుమార్ వాహనదారులకు సూచించారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల పరిధిలోని కంకోల్ గ్రామ శివారులోని ముంబయి జాతీయరహదారిపై డెక్కన్ టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో బుధవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపించాలని సూచించారు. నేటి యువత స్పీడ్‌గా కార్లు నడిపిస్తూ ప్రమాదాల బారినపడుతున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కొండాపూర్ సీఐ చంద్రయ్య, సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్, ఎస్సై సురేశ్, డెక్కన్ టోల్‌ప్లాజా మేనేజర్ రాజేశ్‌విచారే, సిబ్బంది సంతోష్ డోగ్రె, విజయేందర్, నాగరాజు పాల్గొన్నారు.